@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | బుధవారం 13, మార్చి 2024 | పేజీలు: 04

## కాంగ్రెస్ పాలనలో
# కరెంట్ ఏది?
## పంటలు ఎండిపోతున్నా పట్టింపేది?
### మేడిగడ్డపై కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు
### వందరోజుల్లోనే కాంగ్రెస్ బండారం బయటపడింది

- కెసిఆర్ పాలనలో ఈ కష్టాలు లేవని తెలిపోయింది
- గులాబీ జెండానే తెలంగాణకు అండ
- బిఆర్ఎస్ గెలిస్తేనే తెలంగాణకు భవిష్యత్
- కాంగ్రెస్‌ను గెలిపిస్తే వారు అన్నట్లే చేస్తారు
- ఆరు గ్యారెంటీలు కాదుకదా.. అసలు పట్టించుకోరు
- కరీంనగర్ కదనభేరి సభలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్



**నేటి ఫోకస్ న్యూస్, కరీంనగర్-మార్చి12:**
రెప్పపాటు కరెంట్ పోకుండా కరెంట్ ఇచ్చిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వం ఘనతేనని మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. రైతులను ఆదుకోవాలని రైతుబంధు ఇచ్చామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను గెలిపించాలని, గులాబీ జెండా మాత్రమే తెలంగాణకు అండగా ఉంటుందన్నారు. కరీంనగర్ కదనభేరిలో బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఘాటు విమర్శలు చేశారు. గులాబీ జెండా ఎగిరితేనే మిగతా 2లో..





## కోటి మంది మహిళలను
# కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
### ఆడబిడ్డల ఆశీర్వాదం వల్లే కాంగ్రెస్‌కు అధికారం
### మహాలక్ష్మీ స్వశక్తి మహిళా పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్..

**హైదరాబాద్-మార్చి12:**
**తెలంగాణలో కోటి మంది** మహిళలను కోటీశ్వరులుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆడబిడ్డల ఆశీర్వాదం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో 'మహాలక్ష్మి స్వశక్తి మహిళ' పథకాన్ని సీఎం ప్రారంభించారు. మాట తప్పకుండా.. మడమ తిప్పకుండా సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే ఏపీలో పార్టీకి తీవ్ర నష్టమని తెలిసినా మనకు రాష్ట్రం ఇచ్చారు. కానీ, కేసీఆర్ పదేళ్లపాటు మహిళలు, ఆడబిడ్డలను పట్టించుకోలేదు. అందుకే మహిళల ఉసురు తగిలి ఆయన పదవి పోయింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే.. కేసీఆర్ కుటుంబానికి కడుపుమంటగా ఉంది. ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం వద్దంటూ ఆటో డ్రైవర్లతో ధర్నా చేయించారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే రాజీవ్ ఆరోగ్య శ్రీని కేసీఆర్ నిర్వీర్యం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆ పథకాన్ని రూ. 10 లక్షలకు పెంచాం. కేసీఆర్, మోదీ కలిసి రూ.400 ఉన్న గ్యాస్ సిలెండర్‌ను రూ.1200 చేశారు. మహిళలకు మిగతా 2లో..






## కాంగ్రెస్ రెండో జాబితా విడుదల
- 43మంది అభ్యర్థులతో జాబితా ప్రకటన

వివరాలు 02లో..

## ఆధార్ ఉచిత అప్‌డేట్ మరో 3 నెలలు గడువు పొడిగింపు



వివరాలు 02లో..

## పదేళ్ల మోదీ విజయాలు
# ఇంటింటికీ చేరాలి
### తెలంగాణలో 12ఎంపీ సీట్లు గెలుపే లక్ష్యం..
### అవినీతిరహిత భారత్.. మూడోసారీ మోదీ ప్రధాని కావడమే లక్ష్యం
### బూత్‌లెవల్ కార్యకర్తల భేటీలో అమిత్‌షా పిలుపు..



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి12:**
**ప్రధాని మోదీ గత పదేళ్లలో** సాధించిన విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్టీ సోషల్ మీడియా వాలంటీర్లకు పిలుపు ఇచ్చారు. వాస్తవాలు వివరించేందుకు సోషల్ మీడియా వాలంటీర్లు కూడా బాధ్యతగా తీసుకోవాలని అమిత్ షా నిర్దేశించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే అధికారమని అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 12 కంటే ఎక్కువ సీట్లు దక్కించుకుంటామని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. మూడోసారి నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా చూడాలని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో బీజేపీ సోషల్ మిగతా 2లో..

## 16బీసీ కార్పొరేషన్లు
- డిఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు
- ఇందిరమ్మ ఇళ్లకు 22,500 కోట్లు
- కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లను తిరిగి ఎమ్మెల్సీలుగా ఎంపిక
- కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకిని చంద్రఘోష్ విచారణ
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



వివరాలు 02లో..



## దేశవ్యాప్తంగా మరో 10 వందేభారత్ రైళ్లు
- జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ
- వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ/హైదరాబాద్-మార్చి12:**
ఒకేసారి దేశవ్యాప్తంగా 10 వందే భారత్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వర్చువల్ విధానంలో ప్రధాని మోదీజెండా ఊపి ప్రారంభించారు. వీటితో మొత్తం ఈ రైళ్ల సంఖ్య 51కి చేరుకుంది. ప్రధాని మోదీ ప్రారంభించిన రైళ్లలో సికింద్రాబాద్-విశాఖపట్నం, అహ్మదాబాద్-ముంబై సెంట్రల్, మైసూరు-డాక్టర్ ఎంజీఆర్ సెంట్రల్ (చెన్నై), పాట్నా-లక్నో, న్యూ జల్పైగురి-పాట్నా, పూరీ-విశాఖపట్నం, లక్నో- డెహ్రాడూన్, కలబురగి - సర్‌ఎం విశ్వేశ్వరయ్య, రాంచీ - వారణాసి, ఖజురహో- ఢిల్లీ (నిజాముద్దీన్) మిగతా 2లో..








## కాంగ్రెస్-టీఆర్ఎస్-ఎంఐఎం

# మూడు పార్టీలు ఒక్కటే..

- ఈ పార్టీల వల్ల రాష్ట్రానికి దేశానికి ఏం ప్రయోజనం లేదు
- దేశం అభివృద్ధి జరగాలంటే మరోసారి మోది ప్రధాని కావాలి.
- సోషల్ మీడియా వారియర్స్ సిద్ధంకు సిద్ధం కండి: అమిత్ షా..

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్:**

ముచ్చటగా మూడోసారి దేశ ప్రధాని నరేంద్ర మోడీ కావడం ఖాయమని, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ లోని ఇంపిరియల్ గార్డెన్స్ లో నిర్వహించిన సోషల్ మీడియా వారియర్స్ సమావేశనికి ముఖ్య అతిథిగా అమిత్ షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బి పార్టీలు లు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డాయని, పదేళ్ల కాలంలో అవినీతిని అంతం చేసినట్లు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తెలిపారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మూడోసారి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సోషల్ మీడియా కార్యకర్త నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని కోరారు. 5 వందల ఏళ్ల అయోధ్య రామ మందిరం కల నెరవేర్చిన ఘనత మోదీ సర్కార్ కే దక్కిందన్నారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ చేయని పనిని ప్రధాని చేసి చూపించారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు చేసి, ట్రిబుల్ ట్రిబుల్ తలాక్ ను తీసివేసిన వ్యక్తి మోదీ అని అన్నారు. మహిళా రిజర్వేషన్, ఈ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్ అమలు చేసిన ఘనత నరేంద్ర మోడీదే అని అన్నారు. రాష్ట్రం దేశం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ బిజెపి తన సాధ్యమని ఆయన కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బిజేపి మల్కాజ్ గిరి పార్లమెంటు అభ్యర్థి ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ నియోజకవర్గ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, 150వ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్, బి.ఎన్ శ్రీనివాస్, వివిధ వార్డు డివిజన్ ల, అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి





- పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలి
- నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

**నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చ్ 12:**

కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి. పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలి. నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల విధులను సహాయ రిటర్నింగ్ అధికారులు, అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్, కలెక్టర్ పి ఉదయ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సంసిద్ధతపై నగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల అదనపు కలెక్టర్లు, మూడు జిల్లాల 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, అధికారుల విధులపై కలెక్టర్ అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అల్లంపూర్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్డీవోలు,సహాయ రిటర్నింగ్ అధికారులందరూ వారికి కేటాయించిన విధులను, బాధ్యతలను భారత ఎన్నికల సంఘం, ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వర్తించాలన్నారు. ప్రతీ ఒక్క అధికారి ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం జారీ చేసి మార్గదర్శకాలను చదవాలని సూచించారు. ఎన్నికల విధులు సక్రమంగా పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన సిబ్బందిని ముందుగానే ఎంపిక చేసుకుని వారికి సరైన శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు పక్షపాతం, నిర్లక్ష్యం లేకుండా పని చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారంరోజుల్లో ఒక్కో సెక్టర్ పరిధిలో 9 పోలింగ్ కేంద్రాలకు మించి ఏర్పాటు చేయకూడదు అన్నారు. తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏవైనా ఘర్షణలు తలెత్తిన సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వివరాలను తెలియజేయాలన్నారు.ముఖ్యంగా ఆవాస ప్రాంతాల చెంచుల ఓటర్ల నమోదు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల సమయంలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సమస్యలు లేకుండా చూడాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ,కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లుకు పోలీస్ శాఖ అధికారులతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈవీఎంల తరలింపు, అదే విధంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సెక్టర్ అధికారులకు వాహనాల కేటాయింపు, పోలింగ్ సిబ్బందికి కావలసిన వాహనాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల విధులు నిర్వహించే పి.ఓ,ఎపిఓ లకు శిక్షణ తరగతులను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్ మానిటరింగ్ వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ సూచించారు. సార్వత్రిక ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం త్వరలోనే ప్రకటన చేయనుందని, అందుకు అనుగుణంగా ప్రకటన వెలువడిన వెంటనే అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన వెంటనే పర్యవేక్షణ బృందాలు సర్వేలన్స్ ఎఫ్ ఎస్ టి, వీఎస్‌టి, ఎస్ఎస్‌టి పర్యవేక్షణ బృందాలను సంసిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేలా స్వీప్ కార్యక్రమాలను విరివిగా నిర్వహించి పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేసే విధంగా ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి అందుకు సమావేశంలో తీసుకున్న అంశాలను ఎన్నికల సంఘం వెబ్సైట్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు.నూతన ఓటర్ల నమోదు ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించడం, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్ లు, కుమార్ దీపక్, కె సీతారామారావు, గద్వాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, వనపర్తి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గా%శీ%గ్వార్, వనపర్తి రెవిన్యూ అదన కలెక్టర్ నగేష్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, కార్తీక్ కుమార్, నాగర్ కర్నూల్ కల్వకుర్తి అచ్చంపేట కొల్లాపూర్ వనపర్తి గద్వాల అల్లంపూర్ నియోజకవర్గం ఆర్డీవోలు మూడు జిల్లాల మండలాల తహసిల్దార్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు!

- ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ జయశంకర్



**(నేటి ఫోకస్ న్యూస్ మార్చ్):**

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ జయశంకర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు. దైవ ప్రార్థనలతో సామరస్యం. ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. క్రమశిక్షణ భ్రాతృత్వం ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత. సేవ దృక్పథానికి సహనానికి ప్రతీకగా ఈ పండగ జరుపుకోవడం సంతోషకరమన్నారు.



## టీచర్ ఈ దేశానికే ఫ్యూచర్ హెడ్మాస్టర్ రాజశేఖర్ రావు!

- వెన్నచర్లలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం
- విద్యాశాఖ మంత్రిగా కలెక్టర్గా విద్యార్థులు

**(నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ మార్చ్ 12):**

జెడ్పిహెచ్ఎస్ వెన్న చర్ల ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిపారు ఈ సందర్భంగా హెడ్మాస్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ దేశానికి టీచర్ ఏ ఫ్యూచర్ అని సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైనదని అన్నారు పాఠశాల స్వయం పరిపాలన దినోత్సవ సందర్భంగా విద్యాశాఖ మంత్రిగా శివమణి కలెక్టర్‌గా సురేష్ మండల విద్యాశాఖ అధికారిగా మమత హెడ్మాస్టర్ గా పూజిత చారి వ్యవహరించారు ఉత్తమ విద్య బోధన అందించిన టీచర్లకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి మొగులయ్య మాధవరావు మనోహర్ ప్రమోదిని శివుడు విలేజ్ తిరుపతయ్య కవిత పాల్గొన్నారు.



## మూడు వారాలకు మించి దగ్గు ఉంటే టెస్టులు చేయించుకోవాలి

- డాక్టర్ మాధురి
- పాలెంలో టిబి ముక్త పంచాయతీ కార్యక్రమం

**(నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ మార్చ్ 12):**

బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో టీబీ ముక్త గ్రామపంచాయతీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్థానిక వైద్యాధికారి డాక్టర్ మాధురి మాట్లాడుతూ మూడు వారాలకు మించి దగ్గు తెమడ బరువు తగ్గడం ఆకలి వేయకపోవడం సాయంకాలం జ్వరం రావడం బాత్రూం కి వెళ్ళినప్పుడు రక్తం పడటం లాంటి లక్షణాలు ఉంటే వెంటనే టిబి టెస్టులు చేయించుకోవాలని సూచించారు. టీవీ ఒకరి నుండి ఒకరికి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందని తెలియజేశారు ముక్తాభారత్ కార్యక్రమంలో భాగంగా టీవీ ముక్త గ్రామపంచాయతీ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో వీరయ్య ఎంపీహెచ్వో బాదం రాజేశ్వర్ హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ ఏఎన్ఎం గజవర్ధనమ్మ గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ తీగల సువర్ణ ఆశా వర్కర్లు జయమ్మ విజయ లీల పార్వతి గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## మధిరలో రెచ్చిపోతున్న లిక్కర్

# సిండికేట్ మాఫియా..

- 'బీర్లు'రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్స్ లేక ఆగమాగం
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బెల్ట్ షాపులు
- సిండికేట్ వాల్లే సొంతంగా బెల్ట్ షాపులు ఏర్పాటు
- అత్యధిక ధరలు వసూలు..
- ఎమ్ఆర్పి కంటే రూ.20 వసూళ్లు చేస్తున్న వైనం
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ శాఖ అధికారులు





**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,మధిర మార్చి 12:**

కింగ్ ఫిషర్ బీర్ తాగి,రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్స్ ,కింగ్ లా ఎంజాయ్ చేయాలనుకున్న వారిని విగతజీవులుగా మార్చిన ఘటనలు లేకపోలేదు.మధిర కింగ్ ఫిషర్ బీర్లు దొరక్కపోవడంతో వాటిని కొనుక్కునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తయారైంది. ప్రొహిబిషన్ సమయంలో మందుబాబులు పొరుగు రాష్ట్రాలకు వెళ్లినట్టుగానే మధిరహొ పరిసర ప్రాతాల్లోని వాసులు పొరుగు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తయారైంది. లిక్కర్ సిండికేట్ మాఫియా కారణంగా జరుగుతున్న ఈ తంతును కట్టడి చేసేందుకు చట్టాలు కూడా మూగబోయాయా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.కింగ్ ఫిషర్ బీర్ల ,రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్స్ కోసం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తయారైంది. ఇందుకోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసుకుని కింగ్ ఫిషర్ బీర్లు కొనుక్కునేందుకు డ్యూటీలు కూడా వేసుకుంటున్నారట. వంతుల వారీగా బెల్ట్ షాపులోహొవెళ్లి బీర్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కింగ్ ఫిషర్ బీర్ ప్రియులు. అయితే మద్యం సిండికేట్ మాఫియా వల్ల అన్ని రకాల బ్రాండ్లను విక్రయించాల్సిన వ్యాపారులు సాహసించేందుకు ముందుకు రావడం లేదన్న చర్చ సాగుతోంది.

**అండదండలు ఎవరివో..?:** లిక్కర్ సిండికేట్ మాఫియా చెలరేగిపోతున్న తీరుపై కూడా సర్వత్రా చర్చ సాగుతోంది. 'బట్టలూడదీసి కొడ్తాం' మాకేమిస్తావో చెప్పు,మేం తలుచుకుంటే ఏమైనా చేస్తాం అంటూ బెదిరింపులకు కూడా దిగుతున్నా నియంత్రిచేవారే లేకుండా పోయారనీ మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు.

## అటవీ మరియు జంతువులపై అవగాహన

# కల్పించిన ఫారెస్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్వేత

**అచ్చంపేట నియోజకవర్గ (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) ఆర్ భరత్ మార్చి 12 :**

పదర మండలం చిట్లంకుంటలోని మండల పరిషత్ ఉన్నంత పాఠశాల నుండి విద్యార్థిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల బృందం అందరు కలిసి పరహబడ్ వ్యూ పాయింట్సందర్శించడం జరిగింది ఐదు సఫారీలలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులతో పాటు ఫారెస్ట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్వేతా అటవీ గురించి చాలా చక్కగా వివరించడం జరిగింది. సఫారీ వెళ్ళుచున్న సమయంలో అటవీ జంతువులు కనిపించిన వెంటనే విద్యార్థిని విద్యార్థులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు వ్యూ పాయింట్ని చేరుకున్న వెంటనే ఫారెస్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్వేతా చెట్ల గురించి జంతువుల గురించి పర్యావరణం గురించి చాలా చక్కగా వివరించారు అటవీ నుంచి మనకు జరిగే లాభాలు నష్టాలు అదేవిధంగా జంతువుల నుంచి పక్షుల నుంచి మనకు జరిగే లాభాలు నష్టాల గురించి చాలా చక్కగా వివరించడం జరిగింది. అదేవిధంగా తిరిగి మననూర్ చేరుకున్న తర్వాత ఎడ్యుకేషన్ సెంటర్లో ల్యాబ్ ను సందర్శించడం జరిగింది అందులో రకరకాల జంతువులు పాముల గురించి వివరించడం జరిగింది. తర్వాత వీడియో ద్వారా అల్లమల అడవి ప్రాంతంలో ఉండే జంతువులు పక్షులు, పాములు గురించి వివరించడం జరిగింది తర్వాత విద్యార్థులకు పర్యావరణం పై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరు కూడా మొక్కలు నాటి వాటిని మహావృక్షంగా మారేవరకు బాధ్యత తీసుకోవాలి ప్లాస్టిక్ ని వాడకూడదు ప్లాస్టిక్ ని తొలగించాలి ప్రకృతిని కాపాడాలి నీటిని వృధా చేయరాదు వీటి నుంచి జరిగే లాభాలు నష్టాలు గురించి చాలా చక్కగా వివరించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆర్ జ్యోతిలాల్ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎటువంటి అవకాశం కల్పించిన డి ఎఫ్ ఓ రోహిత్ గోపిడి కి ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలుపడం జరిగింది మరియు ఫారెస్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్వేతా ధన్యవాదములు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్ జ్యోతిలాల్ ఉపాధ్యాయుల బృందం ఎస్ కృష్ణవేణి సేవల గోవిందు కిషన్ మాతృ శాంతి పరశురాములు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.







# పకడ్బందీగా పదోతరగతి పరీక్షలు

- లీకేజీలకు ఆస్కారం లేకుండా కఠిన చర్యలు
- అధికారులకు సిఎం స్పష్టమైన ఆదేశాలు
- నో సెల్‌ఫోన్ జోన్‌గా పరీక్షా కేంద్రాలు
- చర్యలకు ఉపక్రమించిన అధికారులు



**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** పదో తరగతి పరీక్షల నిర్వహణ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. గతంలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో పక్కాగా పరీక్షల నొఇర్వహణకు ఆదేశాలు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఈసారి కఠిన ఆంక్షలతో పదో తరగతి పరీక్షలను నిర్వహించనున్నారు పరీక్షా కేంద్రాలవద్ద నో సెల్ ఫోన్ జోన్స్ ను ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగేంత వరకూ అవసరమైతే జామర్లతో సిగ్నల్స్ ఆఫ్ చేయించే యోచనలో అధికారులు ఉన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్, సిబ్బందికి ఫోన్లను అందుబాటులో లేకుండా చూడనున్నారు. రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్న పత్రాలు బయటికి వెళ్లకుండా, మాస్ కాపీయింగ్ జరుగకుండా కట్టుదిట్టంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత ఏడాది జరిగిన ఘటనల నేపథ్యంలో ఈసారి పక్కాగా పరీక్షలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 18 నుంచి ఎప్రిల్ 2 వరకు పదోతరగతి పరీక్షలు జరగనున్నాయి. 5.80 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయ నున్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ క్రమంలో మార్చి 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. గతేడాది వాట్సాప్‌లో ప్రశ్నపత్రాలు హల్‌చల్ చేసిన నేపథ్యంలో అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పరీక్షా కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఇక తనిఖీలకు వచ్చే అధికారులు, కలెక్టర్లు, పోలీస్, విద్యాశాఖ ఉన్నతాధికారులు సెంటర్లల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడాన్ని అనుమతించరు. వీరు తమ సెల్‌ఫోన్లను పరీక్ష కేంద్రం వెలుపలే పెట్టాల్సి ఉంటుంది. పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా 2,676 పరీక్షాకేంద్రాలను ఏర్పా టు చేశారు.ఆయాతేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే సైన్స్ పరీక్షకు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 వరకు, ఒకేషనల్ కోర్సుకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతాయి. పరీక్షల నిర్వహణ దృష్ట్యా రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఏమైనా సమస్యలుంటే 040 -23230942 నంబర్‌ను సంప్రదించవచ్చు. ఈ పరీక్షల నిర్వహణ దృష్ట్యా ఇప్పటికే 12 మంది ఉన్నతాధికారులను జిల్లాస్థాయి అబ్జర్వర్లుగా నియమించారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే స్కూళ్లకు పంపించగా, విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్నిచ్చారు. విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో పరీక్షాకేంద్రాల సమీప స్టేషన్ వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఎస్సెస్సీ బోర్డు నామినల్‌రోల్స్, ఫొటో అటెండెన్స్ షీట్లు జిల్లాలకు చేర్చగా, తాజా గా ఓఎమ్మార్, ప్రశ్నపత్రాలు, సమాధానాల రాసే పేపర్లు, బుక్‌లెట్‌లను జిల్లాలకు పంపిస్తున్నది.పదోతరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టిక్కెట్లు మార్చి 7న విడుదలైన సంగతి తెలిసిందే. అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. పదోతరగతి రెగ్యులర్ విద్యార్థులతోపాటు, ప్రైవేట్, ఓపెన్ స్కూల్, ఒకేషనల్ విద్యార్థుల హాల్‌టికెట్లను కూడా విడుదల చేశారు. తమతమ పాఠశాలల లాగిన్ వివరాలతోపాటు.. తమ పేరు, జిల్లా పేరు, పాఠశాల పేరు, పుట్టిన తేదీ వివరాలు నమోదుచేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. షెడ్యూలు ప్రకారం మార్చి 18న ఫస్ట్ లాంగ్వేజ్, మార్చి 19న సెకండ్ లాంగ్వేజ్, మార్చి 21న థర్డ్ లాంగ్వేజ్, మార్చి 23న మ్యాథమెటిక్స్, మార్చి 26న ఫిజికల్ సైన్స్, మార్చి 28న బయలాజికల్ సైన్స్, మార్చి 30న సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇక ఏప్రిల్ 1న ఓరియంటెల్ పేపర్-1, ఒకేషనల్ కోర్సులకు, ఏప్రిల్ 2న ఓరియంటెల్ పేపర్-2 పరీక్ష నిర్వహించనున్నారు.

# కేన్స్ సెమికాన్ సంస్థ తరలకుండా చూడాలి

### పరిశ్రమలు తరలిపోవడం బాధాకరం: కెటిఆర్

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకువచ్చేందుకు చేసిన కృషి నిష్ఫలమవుతుందని మాజీ మంత్రి కెటి రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సెమీ కండక్టర్ రంగంలో అత్యంత కీలకమైన పెట్టుబడిగా భావిస్తున్న కేన్స్ సెమికాన్ సంస్థ తెలంగాణ నుంచి గుజరాత్ కి తరలిపోతున్నట్లు వచ్చిన వార్తలు పై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే కంపెనీ గతంలో కర్ణాటక రాష్ట్రానికి వెళ్లేందుకు సిద్ధమైనప్పుడు ఎన్నో ప్రయత్నాలు చేసి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించామన్నారు. కంపెనీ కొంగరకలాన్ లో ఫాక్స్ కాన్ పరిశ్రమకు దగ్గరగా భూమి కేటాయింపు కావాలంటే, కేవలం పది రోజుల లోపే అవసరమైన భూమిని కేటాయించి, కంపెనీని ఒప్పించగలిగినట్లు కేటీఆర్ తెలిపారు. అయితే ఇప్పుడు ఇదే కంపెనీ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత తెలంగాణ నుంచి గుజరాత్ కి తమ పెట్టుబడులను తరలిస్తున్నట్లు వచ్చిన వార్తల పైన కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో స్పందించారు. ఈ కంపెనీ క్లాం÷ యూనిట్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంతో పాటు, సెమి కండక్టర్ పరిశ్రమ ఈకో సిస్టమ్ కి అత్యంత కీలకమైనదని, ఈ పరిశ్రమ వస్తే ఈ రెండు రంగాల్లో తెలంగాణ రాష్ట్రం మరింత పురోగతి సాధించే అవకాశం ఉంటుంద న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కంపెనీ యాజమాన్యాన్ని సంప్రదించి... చర్చలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలోనే తమ పెట్టుబడులను కొనసాగించేటట్లు ఒప్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

# ఉద్యోగ ప్రకటనతో కోచింగ్ సెంటర్లకు డిమాండ్..

- అప్పుడే ఉద్యోగాల కోసం యువత కుస్తీ
- ఖాళీల ఆధారంగా యువత ప్రయత్నాలు



**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో మళ్లీ కోచింగ్ సెంటర్ల వద్ద హడావిడి మొదలయ్యింది. డిఎస్సీతో పాటు, గ్రూప్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల కావడంతో వీరిలో చాలా మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్‌లు వేయాలని నిరుద్యోగ యువతి, యువకులు కోరుతున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించింది. అలాగే గ్రూప్ పరీక్షలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత సర్కారు కొలువుల కోసం ఇప్పటి నుంచే కుస్తీ పడుతున్నారు. గ్రంథాలయాలు నిరుద్యోగ యువతతో నిండిపోతున్నాయి. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పడుతున్నారు. ఉపాధి కోసం వేల మంది యువత ఎదురు చూస్తోంది. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ఉద్యోగుల భర్తీ నోటిఫికేషన్ వెలువడక పోవడంతో ఉపాధి కోసం జిల్లాల్లో వేల మంది యువతి, యువకులు ఎదురుచూస్తున్నారు. బీఈడీ, డీఎడ్ చేసిన అభ్యర్థులకు యేటా రెండు సార్లు టెట్ నిర్వహించాలి. కానీ కొన్నేళ్లుగా అది జరగడం లేదు. దీంతో ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేసిన అభ్యర్థులు చాలా మంది ప్రైవేట్ పాఠశాలలో చదువులు చెప్పే అవకాశాన్ని కోల్పోయారు. పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగాలు కోల్పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రకటన చేయడంతో జిల్లాలో నిరుద్యోగులు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలో శాఖల వారీగా ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్న పోస్టులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతలో ఆశలు చిగురి స్తున్నాయి. ఇవేకాకుండా మరికొన్ని శాఖల్లోనూ వందల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యా, వైద్యశాఖలతో పాటు పోలీసుశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఉద్యోగాల నియామకంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని కూడా పెంచుతూ ప్రకటించడంతో నిరుద్యోగుల్లో మరింత ఆశలను రేకెత్తిస్తోంది. ఇవే కాకుండా మరికొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా విద్యాశాఖలో ఎక్కువగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారుల నివేదికలో తేలింది. మరో 21 ప్రభుత్వ శాఖల్లో వెయ్యికి పైగా ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయా శాఖల అధికారులు పేర్కొంటున్నారు.

# సన్నరకం ధాన్యం సాగుపై రైతుల ఆసక్తి

- ధాన్యం ధరల పెరుగుదలతో మారుతున్న తీరు
- వ్యాపారులు, మిల్లర్లతో రైతుల ఒప్పందాలు



**నిజామాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** జిల్లాలో యాసంగి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. యాసంగిలో సన్న వరి వేయడంతో రైతులు సాగులో నిమగ్నమ య్యారు. దొడ్డురకాలకు డిమాండ్ లేకపోవడంతో సన్న రకాలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా సన్నబియ్యం ధరలు అనూ మ్యంగా పెరగడం, మార్కెట్లో డిమాండ్ పెరగడంతో రైతులు ఈ రకాలకు మొగ్గు చూపారు. దీంతో అమ్మకాల్లో పెద్దగా ఇబ్బం దులు ఉంవని భావిస్తున్నారు. గతేడాది నుంచి ఇదే పద్దతి అవలం బిస్తున్నారు. రైతులు ఆరుతడి పంటలను సైతం ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. జిల్లాలో పంటల సాగు వాస్తవ పరిస్థితిని తెలుసు కునేందుకు వ్యవసాయ అధికారులు క్లస్టర్‌ల వారీగా క్రాప్ బుకింగ్‌ను చేస్తున్నారు. ప్రతి గ్రామ పరిధిలోకి వ్యవసాయశాఖ అధికారులు వెళ్లి క్రాప్ బుకింగ్ యాప్ ద్వారా సర్వే నెంబర్‌లను నమోదు చేస్తున్నారు. సర్వే మ్యాప్‌లో రైతులు వేసిన పంటల వాస్తవ పరిస్థితిని గుర్తించి విస్తీర్ణాన్ని నమోదు చేస్తున్నారు. ఏయే పంటలు వేశారో వివరాలను నమోదు చేస్తున్నారు. వరితో పాటు ఏ పంటలు ఎక్కువగా వేశారో వాటిని నమోదు చేస్తున్నారు. పంటల మార్పిడికి రైతులు మొగ్గుచూపారా లేదా అనే అంశాలను ఈ క్రాప్ బుకింగ్ ద్వారా వివరాలను తెలుసుకుంటున్నారు. మొత్తం జిల్లాలో సాగైన పంటల విస్తీర్ణం, వాటి వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో గత సంవత్సరంతో పోలిస్తే 30వేల ఎకరాల్లో వరి సాగు తగ్గింది. ప్రస్తుతం మూడున్నర లక్షల ఎకరాల్లో సాగు కావడం వల్ల 8లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి రానుంది. జిల్లాలో వరి ఎక్కువ సాగు చేయడం వల్ల రైతులు ధాన్యం అమ్ముకునేందుకు తిప్పలు పడే పరిస్థితులు ఏర్పడనున్నాయి. జిల్లాలో వర్ని, మోస్రా, చందూర్, కోటగిరి, రుద్రూర్ మండలాల పరిధిలో వరి సాగును ముందుగా చేశారు. ఈ నెలాఖరు నుంచి వరి కోతలను మొదలు పెట్టనున్నారు. ఈ మండలాల పరిధిలోని రైతులు ఇప్పటికే సూర్యాపేట, కర్నూల్, బల్లారి వ్యాపారులతో ఒప్పందాలను చేసుకుం టున్నారు. వరికోతలు మొదలుపెట్టగానే వారికే ధాన్యాన్ని అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సన్న రకాలు సాగుచేసిన రైతులతో రైస్ మిల్లర్‌లు కూడా ఒప్పందాలు చేసుకుంటున్నారు. తమ మిల్లులకు దగ్గరగా ఉన్న గ్రామాల్లో రైతులు వేసిన పంటలను కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. జిల్లాలో పంటల సాగు మొదట తగ్గినా.. రైతులు ఆరుతడి పంటలను వేయడంతో సాగు పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. క్రాప్ బుకింగ్ ద్వారా పంటల వాస్తవ పరిస్థితిని నమోదు చేశామని తెలిపారు. వరి కొంతమేర తగ్గిన ఎర్రజొన్న, సజ్జ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలు పెరిగాయన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే కొంతమేర పంటలు తగ్గినా ఎక్కువ మొత్తంలోనే సాగు కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన నెల రోజులుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న క్రాప్ బుకింగ్ వల్ల పంటల సాగు వాస్తవ పరిస్థితి బయటపడింది. గత సంవత్సరంకంటే లక్ష ఎకరాల వరకు వరి తగ్గుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. వేసినా.. పంటల సాగు తగ్గలేదు. జిల్లాలో శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుతో పాటు గుత్ప, అలీసాగర్, లక్ష్మి కాల్వల కింద వరి ఎక్కువగా సాగు చేశారు. వీటితో పాటు రామడుగు రిజర్వాయర్ కింద వరి వేశారు. జిల్లాలోని ప్రాజెక్టుల ఆయకట్టులేని ప్రాంతాల్లో బోర్ల కింద వరిసాగు కొనసాగించారు. ప్రభుత్వం కొనుగోలు చేయకున్నా ధాన్యాన్ని అమ్ముకునేవిధంగా ఎక్కువ మొత్తంలో సన్న రకాలను వేశారు. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం యాసంగిలో సన్న రకాలను 55 శాతానికి పైగా రైతులు వేశారు. దొడ్డు రకాలను తగ్గించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకున్న వ్యాపారులు, రైస్ మిల్లర్‌లకు అమ్ముకునేవిధంగా ఏర్పాట్లను చేసుకున్నారు.



# రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సిఎంఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, వారి సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో జరిపే ఉపవాస దీక్షలు, ప్రత్యేక ప్రార్థనలతో ప్రజల మధ్య శాంతి, సామరస్య భావనలు వెల్లివిరుస్తాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# హర్యానా కొత్త సీఎంగా నయాబ్ సింగ్ సైనీ

### ఎంపిక చేసిన బిజెపి అదిష్టానం అభినందించిన బిజెపి శ్రేణులు



**చండీఘడ్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** హర్యానాలో బీజేపీ సీనియర్ నేత, సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ రాజీనామా నేపథ్యంలో కొత్త సీఎంకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా పార్టీ నుంచి వెలువడింది. హర్యానా కొత్త సీఎంగా నయాబ్ సింగ్ సైనీని ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో సైనీ సాయంత్రం 5 గంటలకు హర్యానా సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నయాబ్ సింగ్ సైనీ ప్రస్తుతం హర్యానా బీజేపీ అధ్యక్షుడు, కురుక్షేత్ర లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఉన్నారు. సైనీ జనవరి 25, 1970న అంబాలాలోని చిన్న గ్రామమైన మిజాపూర్ మజ్రాలో కుటుంబంలో జన్మించారు. ఆయన ముజఫర్‌పూర్‌లో బి.ఆర్. అంబేద్కర్ బీహార్ విశ్వవిద్యాలయం నుంచి. బీఏ, ఎల్ఎల్‌బీ డిగ్రీలు పొందారు. అతను రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో కూడా గతంలో చేరారు. ఆ తర్వాత అతను మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలుసుకుని, అతనిచే ప్రభావితమయ్యారు. ఆ తర్వాత అతను బీజేపీలో చేరి అంబాలా కంటోన్మెంట్‌లో అధ్యక్షుడితో సహా పార్టీలో అనేక పదవుల్లో పనిచేశారు. నయాబ్ సింగ్ సైనీకి 1996 నుంచి బీజేపీతో అనుబంధం ఉంది. 2002లో భారతీయ జనతా పార్టీ యువమోర్చా, అంబాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2005లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2009లో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా హర్యానా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. సైనీ 2010లో నారాయణ్ గఢ్ నుంచి మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2014లో ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. ఆ క్రమంలోనే 2015లో మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2019లో కురుక్షేత్ర స్థానం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నిర్మల్ సింగ్‌పై 3.85 లక్షల ఓట్లతో విజయం సాధించారు. మనోహర్ లాల్ ఖట్టర్‌కు సైనీ అత్యంత సన్నిహితుడు. బీజేపీ సీనియర్ నేత మనోహర్ లాల్ ఖట్టర్ సీఎం పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మొత్తం క్యాబినెట్ రాజీనామా చేసింది. శాసనసభాపక్ష నేతగా నయాబ్ సింగ్ సైనీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుభాష్ సుధా తెలిపారు. సైనీ పేరును ప్రతిపాదించగా, ఆ మీటింగ్ నుంచి అనిల్ విజ్ వెళ్లిపోయారు. కొత్త క్యాబినెట్‌లో ఆయనకు మంత్రి పదవి దక్కడం అనుమానంగానే ఉన్నది. కేంద్రమంత్రి అర్జున్ ముండా పరిశీలకుడిగా వచ్చారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై దుండగుల దాడి

**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై గుర్తు తెలియని యువకులు దాడి చేశారు. అనురాగ్ విశ్వవిద్యాలయం సమీపంలో కారులో వెళ్తున్న టీసీఎస్ ఉద్యోగి కుర్వ నవీన్ కుమార్‌పై యూనివర్సిటీ వద్ద 8 మంది యువకులు అకారణంగా దాడి చేశారు. కొర్రెముల చౌరస్తా వరకు వెంబడించి చితకబాదారు. కారుపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. అనంతరం యువకులు బలవంతంగా కారును తీసుకెళ్లారు. నారపల్లి నందనవనం వద్ద కారును వదిలి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# మారుతున్న రాజకీయ సమీకరణాలు

### వేం నరేందర్ రెడ్డితో గుత్తా అమిత్ భేటీ కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం భువనగిరి టిక్కెట్ కోసం యత్నాలు



**హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-మార్చి12:** శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆయన తనయుడు అమిత్ రెడ్డి కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. మంగళవారం ఉదయం గుత్తా అమిత్ రెడ్డి ప్రభుత్వ సలహాదారు, సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి ఇంట్లో ప్రత్యక్షమయ్యారు. కాంగ్రెస్ టికెట్ కోసమే అమిత్ రెడ్డి భేటీ అయ్యారనే చర్చ మొదలైంది. నల్లగొండ టికెట్ ను ఇప్పటికే కాంగ్రెస్ అధినాయకత్వం జానారెడ్డి కుమారుడు కుందూరు రఘువీర్ రెడ్డికి ప్రకటిచింది. భువనగిరి స్థానాన్ని పెండింగ్ లో పెట్టింది. అమిత్ రెడ్డి భువనగిరి టికెట్ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే వేం నరేందర్ రెడ్డిని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధమైనా వెనుకడుగు అమిత్ వేస్తున్నట్లు తెలుస్తోంది. గుత్తా అమిత్ కు నల్లగొండ లేదా భువనగిరి టిక్కెట్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధమైనప్పటికీ బీఆర్ఎస్ లో ఉన్న స్థానిక రాజకీయాల కారణంగా ఆయన తన కుమారుడ్ని కాంగ్రెస్‌లోకి పంపాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డితో గుత్తా వర్గయులకు సరిపడటం లేదు. టిక్కెట్ ఇచ్చినా జగదీష్ రెడ్డి వర్గం సహకరించదన్న కారణంగా వారు బయటకు రావాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే భువనగిరి టిక్కెట్ ను కాంగ్రెస్ రెడ్డి వర్గానికి కేటాయిస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. శాసనమండలి చైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా పార్టీ మారితే బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బ అనుకోవచ్చు. ఎందుకంటే అసెంబ్లీలో ఓడిపోయినా.. ఇప్పటికీ తెలంగాణ శాసనమండలిలో... బీఆర్ఎస్ కే మెజార్టీ ఉంది. కీలకమైన బిల్లులు ఏమైనా మండలికి వచ్చినప్పుడు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మండలి చైర్మన్ కూడా కాంగ్రెస్ వైపు మారిపోతే ఇబ్బంది పోతుంది. గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆయన కుమారుడు పార్టీ మారకుండా ఉండేందుకు కేటీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే గుత్తా కుటుంబీకులు స్పందించడం లేదని తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటి నుండి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. పెద్ద ఎత్తున నేతలు ఇతర పార్టీల్లోకి వలస పోతున్నారు. రెండు జాతీయ పార్టీలు బలంగా కనిపిస్తుండటంతో ఆ పార్టీల వైపు మొగ్గుతున్నారు. బీఆర్ఎస్ టిక్కెట్లు ఇస్తామని చెబుతున్నప్పటికీ పార్టీలు మారిపోతూండటం ఆశ్చర్యకరంగా మారింది. ఈ పరిణామాల్ని ఎలా డీల్ చేయాలో తెలియక.. బీఆర్ఎస్ నేతలు తంటాలు పడుతున్నారు.